## వదిలేసి పోండి చాలు..

# మెషీన్లే పార్క్ చేస్కుంటయ్

## నాంపల్లిలో ఆటోమేటిక్ పజిల్ పార్కింగ్ రెడీ

- ఒకటే బిల్డింగ్‌లో 250 కార్లు, 200 బైక్స్ పార్క్ చేసుకోవచ్చు
- 15 అంతస్తుల కాంప్లెక్సులో 10 ఫ్లోర్లు పార్కింగ్‌కే
- మిగిలిన వాటిలో థియేటర్లు, గ్యాలరీలు..
- పరిశీలించిన మెట్రో ఎండీ



**హైదరాబాద్‌సిటీ, వెలుగు :**
పార్కింగ్ సమస్యలను పరిష్కరించేందుకు నాంపల్లిలో నిర్మిస్తున్న 15 అంతస్తుల అత్యాధునిక పజిల్ పార్కింగ్ బిల్డింగ్‌కు తుది మెరుగులు దిద్దుతున్నట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ బిల్డింగులో 250కార్లు, 200 బైకులు ఈజీగా పార్క్ చేసుకోవచ్చు. పైగా, అక్కడ మనం కారు వదిలేసి పోతే చాలు సెన్సార్ల సాయంతో పని చేసే మెషీన్లు పార్క్‌చేస్తాయి. ఈ ప్రాజెక్టును హెచ్ఎంఆర్ఎల్ ఆధ్వర్యంలో పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానంలో 'నోవమ్' నిర్మిస్తున్నది. జర్మనీకి చెందిన 'పాలిస్' టెక్నాలజీతో పూర్తి ఆటోమేటెడ్ పజిల్ పార్కింగ్ వ్యవస్థగా ఇది రూపుదిద్దుకుంటోంది.

**పార్కింగ్.. కమర్షియల్ స్పేస్**

2,000 చదరపు గజాల్లో 15 అంతస్తులతో నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లో మూడు బేస్‌మెంట్లు, ఏడు పైఅంతస్తులతో కలిపి 10 పార్కింగ్ ఫ్లోర్లు ఉన్నాయి. మిగిలిన 5 అంతస్తుల్లో 2 లేటెస్ట్‌సినిమా థియేటర్లు, గ్యాలరీ ఉంటాయి. ఇక్కడ కార్లను తీసుకువెళ్లి వదిలేస్తే సెన్సార్ల సాయంతో మనుషుల ప్రమేయం లేకుండానే మెషీన్లు తీసుకువెళ్లి ఆటోమేటిక్‌గా పార్క్‌చేస్తాయి. పైగా ఈ సెన్సార్లు ఎస్‌యూవీ, సెడాన్‌లు, చిన్న కార్లను వాటి సైజ్ ఆధారంగా గుర్తించి వేరు చేసి, ఎక్కడ పార్క్‌చేయాలో అక్కడే పార్క్ చేస్తాయి. వాహనాన్ని ఏ కోణంలో విడిచినా, 360 డిగ్రీలు తిరిగే 'పాలిస్' టర్న్‌టేబుల్ స్వయంగా సరైన స్థితిలో పెట్టి పార్క్ చేస్తుంది.

**ఎలా పని చేస్తుందంటే..**

ఎంట్రన్స్ లో క్యూ ఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డ్ స్వైప్ చేస్తే టెర్మినల్ గేట్ తెరుచుకుంటుంది. డ్రైవర్ తన వాహనాన్ని టర్న్ టేబుల్‌పై నిలిపి, హ్యాండ్‌బ్రేక్ వేసి, ఇంజిన్ ఆఫ్ చేసి బయటకు వస్తే సరిపోతుంది. కార్డును స్వైప్ చేయగానే సిస్టమ్ వాహనాన్ని స్కాన్ చేసి, ఎస్‌యూవీలు, సెడాన్‌గా వర్గీకరించి కావాల్సిన చోట పార్క్ చేస్తుంది. ఫీజు పే చేసిన తర్వాత సూచించిన టెర్మినల్ వద్ద కార్డు స్వైప్ చేస్తే వాహనం అక్కడికే వస్తుంది.



**తొందరలోనే అందుబాటులోకి..**

తొందర్లోనే ఈ అత్యాధునిక, ప్రపంచంలోనే అరుదైన పూర్తి ఆటోమేటెడ్ పార్కింగ్ వ్యవస్థ అందుబాటులోకి రాబోతోంది. తుది అనుమతులు రాగానే అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రపంచంలోనూ ఇటువంటి సౌకర్యాలు ఉన్న పార్కింగ్‌సిస్టమ్ అరుదు. వాహనాలు లోపలికి, బయటకు వచ్చే టెర్మినల్స్ విశాలంగా, స్మార్ట్‌గా రూపొందించాం. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు అనుకూలమైన ఫ్లాట్ టెర్మినల్స్ ఉన్నాయి. ఇది అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.